ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 11 సెప్టెంబరు 2025



కడప నగరంలోని నబీకోటలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు





కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యంకోసం వేచి ఉన్న జ్వర పీడితులు

జిల్లాను వైరల్ ఫీవర్ పట్టి పీడిస్తోంది. జిల్లా కేంద్రమైన కడప నగరం మొదలుకుని చివరన ఉన్న కలసపాడు వరకు.. జిల్లా అంతటా జ్వర పీడితులే. వాతావరణంలో మార్పులు, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వైరల్ ఫీవర్స్ దండయాత్ర చేస్తున్నాయి. వీటిపై వైద్య ఆరోగ్యశాఖ ముందస్తు అప్రమత్తత లేకపోవడంతో జనం విలవిల్లాడుతున్నారు. ఎక్కడ చూసినా.. ఎవరుచూసినా ఖణేల్ ఖణేల్ అని దగ్గుతూ చీదుతూ కనిపిస్తున్నారు. గొంతునొప్పితో ఇబ్బంది పడుతున్నారు. ఒకసారి వచ్చిన జ్వరం కనీసం పదిరోజుల పాటు వదలడం లేదు. దీంతో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులన్నీ జ్వరం వచ్చిన వారితో నిండిపోతున్నాయి.



కలసపాడు మండలంలో జ్వరంతో మంచం పట్టిన బాధితులు

● కలసపాడు మండలంలో వైరల్ ఫీవర్స్ ఉన్నాయి. ఇక్కడ రోజూ ప్రభుత్వ ఆసుపత్రి ఓపీలో 20 మందికి పైగా జ్వరంతో ఇబ్బంది పడుతున్నవారే ఉంటున్నారు. అట్లూరు. కాశినాయనలో వైరల్ ఫీవర్స్ ఉన్నాయి. పులివెందులలోని భాకరాపురం, నగరిగుట్ట, నల్లపురెడ్డిపల్లె ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైరల్ ఫీవర్స్ విజృంభిస్తున్నాయి.

జిల్లాకు జ్వరం..!



మైదుకూరు మండలంలోని శ్రీనగర్‌లో టైఫాయిడ్‌తో బాధపడుతున్న బాలిక

- వైరల్ ఫీవర్‌తో జనం విలవిల
- దగ్గు, జలుబు, గొంతు నొప్పితో బాధపడుతున్న వైనం
- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిట
- వాతావరణంలో మార్పులే కారణం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు వైరల్ ఫీవర్ బాధితులతో కిటకిటలాడుతున్నాయి. దీంతో పాటు టైఫాయిడ్, డెంగ్యూ కేసులు కూడా నమోదవుతున్నాయి. కడపలోని సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో రోజూ సుమారు 1200 వరకు ఓపీ ఉంటుంది. ఇక్కడకు వచ్చే వారిలో సుమారు వందమంది దాకా వైరల్ ఫీవర్ బాధితులు ఉంటున్నారు. ఇక కడపలోని నాగరాజుపేట, రవీంద్రనగర్, నబీకోట, ఆర్కేనగర్, ఎర్రముక్కపల్లె, బాలాజీనగర్, వైజంక్షన్, నకాశ్, సాయిపేట.. ఇలా ప్రతిచోటా వైరల్ ఫీవర్స్ బారిన పడిన బాధితులు ఉన్నారు. నాగరాజుపేట, ఆర్టీసీబస్టాండు, ప్రాంతంతో పాటు మరికొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వరపీడితుల తాకిడి ఎక్కువైంది.



పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం ఎస్సీకాలనీలో వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నవారు

జిల్లా అంతటా ఇదే పరిస్థితి



వీరంతా ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చిన రోగులు. రోజూ 1400 మంది ఓపీ ఉంటుంది. ఇక్కడకు వచ్చే కేసుల్లో దాదాపు వందకు పైగా వైరల్ ఫీవర్స్ నమోదవుతున్నాయి. కామనూరు పీహెచ్‌సీ పరిధిలో రోజూ ఆరుకు తగ్గకుండా జ్వరం కేసులు నమోదవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే కేసుల్లో వైరల్ ఫీవర్, టైఫాయిడ్ నమోదవుతున్నట్లు సూపరింటెండెంట్ రూపానంద్ వెల్లడించారు. ఒక డెంగ్యూ కేసు నమోదు అయిందన్నారు.

ఖణేల్ ఖణేల్..

వైరల్ ఫీవర్‌తో పాటు విపరీతమైన గొంతు నొప్పి, తీవ్ర దగ్గు వస్తుండడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. దగ్గలేక దగ్గలేక అగచాట్లు పడుతున్నారు. డాక్టర్ ఫీజు, రక్తపరీక్షలు, మెడిసిన్ చూస్తే రూ.3వేల నుంచి రూ.4వేలు ఖర్చవుతుంది. ఈ కాలంలో సీజనల్ వ్యాధులు సామాన్యులను ముప్పుతిప్పలు పెడతాయి. ఈ విషయం తెలిసినా వైద్యఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు సరిగా చేపట్టకపోవడంతో జనం ఆరోగ్య పరంగా ఆర్థికంగా చితికిపోతున్నారు. ఈ దురవస్థ కేవలం ఒక పల్లెకో పట్టణానికే పరిమితం కాలేదు.. జిల్లా వ్యాప్తంగా ఈ మాయదారి వైరల్ ఫీవర్ ఉండడం గమనార్హం.

● దువ్వూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి బుధవారం 102 మంది ఓపీ ఉండగా.. అందులో 19 మందికి వైరల్ ఫీవర్ నమోదయింది. కొండాపురం పీహెచ్‌సీ పరిధిలో టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. జమ్మలమడుగు మండలంలోని మోరగుడి, గూడెంచెరువు, రాజీవ్‌నగర్, జమ్మలమడుగులోని వెంకటేశ్వరకాలనీ, భాగ్యనగర్‌కాలనీ, కన్నెలూరులో డ్రైనేజీ అధ్వాన్నంగా ఉండడంతో ఇక్కడ విషజ్వరాలు వస్తున్నాయని జనం ఆరోపిస్తున్నారు.

● మైదుకూరు మున్సిపాలిటీలో వైరల్‌ఫీవర్‌తో పాటు టైఫాయిడ్, మలేరియా సోకుతుండడంతో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ 400 ఉంటే అందులో 150 మంది జ్వరం వచ్చిన వారే ఉన్నారు. దువ్వూరు, చాపాడు మండలాల నుంచి మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం వస్తుంటారు. రక్తపరీక్షలు నిర్వహించి దాని ప్రకారం ట్రీట్‌మెంటు ఇస్తున్నట్లు వైద్యాధికారి కరీముల్లా వెల్లడించారు.

పద్దెదుమందికి జ్వరం



నాకు నాలుగు రోజుల నుంచి జ్వరం వస్తోంది. కీళ్లనొప్పులతో ఇబ్బందులు పడుతున్నా. నాతో పాటు మా ఊర్లో పద్దెదు మందికి జ్వరం ఉంది. అయినా వైద్యబృందం మా ఊరికి రాలేదు.

- రామసుబ్బయ్య, బయనపల్లె, దువ్వూరు మండలం

నాలుగురోజులుగా ..



మా ఊరిలో చిన్నపిల్లలు వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. నాకు నాలుగురోజుల నుంచి జ్వరం వస్తుండడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా. అయినా తగ్గడం లేదు.

- మానస, గంగవరం

కాచిన నీళ్లు తాగాలి

జిల్లాలో సీజనల్ వ్యాధులు ఉన్నాయి. ప్రస్తుతం అవి తగ్గుముఖం పట్టాయి. ప్రజలు నీళ్లు కాచుకుని తాగాలి. ఇమ్యూనిటీ పెంచుకునేందుకు పౌష్టికాహారం తీసుకోవాలి. ఒక్క డెంగ్యూ కేసు నమోదయింది. ఆ వ్యక్తి కూడా కోలుకున్నారు.

- నాగరాజు, డీఎంహెచ్‌వో

ఆసుపత్రులు, స్కూళ్లను పట్టించుకోండి



● రాజ్యసభ ఎంపీ డాక్టర్ శివదాసన్

మాట్లాడుతున్న సీపీఎం రాజ్యసభ సభ్యుడు శివదాసన్

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు విగ్రహాలకు రూ.వందలకోట్లు ఖర్చుపెట్టడం మానుకుని స్కూళ్లను, ఆసుపత్రులను పట్టించుకోవాలని సీపీఎం రాజ్యసభ ఎంపీ శివదాసన్ పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్ఐసీ, జాతీయ బ్యాంకులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి అధ్యక్షతన బుధవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పింఛనర్ల సంఘాల సెమినార్‌లో సీపీఎం రాజ్యసభ్యుడు శివదాసన్ మాట్లాడారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోయాయని, యూనివర్సిటీలలో రెగ్యులర్ ఫ్యాకల్టీ లేరని అన్నారు. ఆరోగ్య రంగంలో కేటాయింపులు తగ్గిపోవడం వల్ల చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు కూడా నియంత్రించలేని స్థితి నెలకొందన్నారు. ప్రభుత్వాలు విగ్రహాలకు వందలకోట్లు ఖర్చుపెడుతున్నాయని, కానీ స్కూళ్లను, ఆసుపత్రులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల్లో, పేదల్లో ప్రభుత్వాల పట్ల వ్యతిరేకత పెరుగుతోందన్నారు. దీనిని దారి మళ్లించేందుకు భాష, మతం, ప్రాంతం ఆధారిత సమస్యలను పాలకులు రెచ్చగొడుతున్నారన్నారు. విశ్వమానవ భావనతో కేరళ తరహా ప్రత్యామ్నాయ విధానాల కోసం అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

2600 టన్నుల ఎరువులు రాక

కడప రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వ్యవసాయ అవసరాలకు గాను బుధవారం కడప రైల్వేస్టేషన్‌కు రేక్ ద్వారా కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు 2600 టన్నుల యూరియా ఎరువులు వచ్చాయి. డీఏవోలు, కంపెనీ ప్రతినిధులు రేక్ అధికారులతో సంప్రదించి కేటాయించిన పరిణామాలను ఆయా జిల్లాలకు సరఫరా చేశారు. ఇందులో కడప జిల్లాకు 800 టన్నులు రాగా వాటిలో 290 టన్నులు ప్రైవేట్ డీలర్లకు, 510 టన్నులు మార్క్‌ఫెడ్‌కు తరలించారు. అలాగే అన్నమయ్య జిల్లాకు 500 టన్నులు రాగా వాటిలో ప్రైవేట్ డీలర్లకు 100 టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 400 టన్నులు పంపిణీ చేశారు. అలాగే అనంతపురం జిల్లాకు 800 టన్నులు రాగా వాటిలో ప్రైవేట్ డీలర్లకు 240 టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 560 టన్నులు కేటాయించారు. సత్యసాయి జిల్లాకు 500 టన్నులు రాగా వాటిలో ప్రైవేట్ డీలర్లకు 150 టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 350 మెట్రిక్ టన్నులు ఇచ్చారు.



కడప రైల్వేస్టేషన్‌లో ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ తదితరులు

కన్యాకుమారి రైలుకు పూజలు



కొండాపురం రైల్వేస్టేషన్‌లో కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలుకు పూజలు నిర్వహించి స్వాగతం పలుకుతున్న స్థానికులు

కొండాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వేస్టేషన్‌లో స్థానికులు బుధవారం కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు (జయంతి ఎక్స్‌ప్రెస్)కు పూజలు నిర్వహించారు. కరోనా తర్వాత కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఈ రైలుకు స్టాపింగ్ ఎత్తివేశారు. తిరిగి బుధవారం నుంచి పునరుద్ధరించడంతో ఉదయం 7.30 గంటల ప్రాంతంలో రైలు స్టేషన్‌లోకి రాగానే స్థానికులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని ఘనంగా స్వాగతం పలికారు. మామిడి ఆకులు, పూలదండలతో రైలుకు తోరణాలు కట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బ్రిటీష్‌కాలం నుంచి కొండాపురం రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. పక్కనే చిత్రావతి, పెన్నా నదులతో పాటు గండికోట బ్యాక్‌వాటర్ ఉండటం వల్ల స్టేషన్ మీదుగా వెళ్లే దాదాపు 80 శాతం రైళ్లు నీళ్ల కోసం ఇక్కడ ఆగేవని అన్నారు. కరోనా తర్వాత ఒక ఇంటర్‌సిటీ ప్యాసింజర్ తప్ప అన్ని రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేశారన్నారు. ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు రైల్వేశాఖపై ఒత్తిడి తేవడం వల్ల మూడు రైళ్లకు స్టాపింగ్ ఇచ్చారన్నారు. ఈ రైళ్లతో పాటు కొండాపురం రైల్వేస్టేషన్‌లో అన్ని రైళ్లకు స్టాపింగ్ పునరుద్ధరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీరామ్ బాబురెడ్డి, మనోహర్‌బాబు, ప్రజాసంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

మైలవరానికి నీరు నిలుపుదల

కొండాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి బుధవారం రాత్రి నుంచి నీరు నిలుపుదల చేశామని ఈఈ ఉమా మహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 7,100 క్యూసెక్కులు ఉందన్నారు. జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 6,500 క్యూసెక్కులు ఉందన్నారు. కాగా సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 24.682 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ తెలిపారు

47 మంది ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు బదిలీ

కడప క్రైం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న 47 మంది సిబ్బందిని బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 14 మంది ఏఎస్ఐలు, 33 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు స్థానచలనం కల్పించారు. బదిలీ అయిన సిబ్బంది వారికి కేటాయించిన పోలీస్ స్టేషన్లల్లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీచేశారు.

పోలీస్ శాఖకు నూతన జాగిలం

కడప (క్రైం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కేసుల ఛేదనలో నేరస్థులను గుర్తించేందుకు వీలుగా పోలీసు శాఖకు నూతన జాగిలం వచ్చింది. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ నూతన జాగిలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సోను అనే జాగిలం మలనాయిస్ జాతికి చెందినదని, మంగళగిరి హెడ్ క్వార్టర్స్ కెనైన్ ట్రైనింగ్ సెంటర్‌లో 10 నెలల పాటు పేలుడు, ట్రాకింగ్ అంశాల్లో శిక్షణ పొందిందని తెలిపారు. అనంతరం డాగ్‌స్క్వాడ్‌కు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శివరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.



జాగిలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

పదినిమిషాల్లో ముగిసిన కౌన్సిల్ సమావేశం

● ఎగ్జిబిషన్, మార్కెట్ లీజు వేలానికి ఆమోదం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం పదినిమిషాల్లో ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశానికి టీడీపీ వైసీపీ సభ్యుల ఆందోళనలతో బ్రేక్ పడింది. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి టీడీపీ కౌన్సిలర్లతో సహా సభ నుంచి వెళ్లిపోవడంతో కమిషనర్‌తో సహా అధికారులందరూ వెళ్లిపోయారు. అర్ధాంతరంగా కమిషనర్ రవిచంద్రారెడ్డి సభనుంచి వెళ్లిపోవడంతో వైసీపీ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం మధ్యాహ్నం 2 గంటలవరకు కౌన్సిల్ హాల్లోనే నిరసన చేపట్టారు. కమిషనర్ వచ్చి కౌన్సిల్ సమావేశం జరిపేవరకు తాము కదలమని భీష్మించి కూర్చుకున్నారు. రాత్రంతా కౌన్సిల్ హాల్లోనే జాగారం చేశారు. బుధవారం ఉదయం నుంచి మున్సిపల్ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు వైసీపీ కౌన్సిల్ సభ్యులతో చర్చల అనంతరం కమిషనర్ రవిచంద్రారెడ్డి మధ్యాహ్నం 2 గంటలకు అధికారులతో కలిసి కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి ఎక్స్‌అఫిషియో సభ్యుడు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో సహా 16మంది టీడీపీ కౌన్సిలర్లు హాజరు కాలేదు. దీంతో సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు మాత్రమే అజెండాలో 4వ అంశం తప్ప తక్కిన అంశాలు ఆమోదించారు. ఎగ్జిబిషన్, కూరగాయల మార్కెట్ లీజు వేలం అంశాలను ఆమోదించారు. ఎగ్జిబిషన్‌లో ఎంట్రీ టిక్కెట్ల ధరలను పెంచడంతో పాటు పాట దక్కించుకున్న వారంలోపు డబ్బులు మొత్తం చెల్లించేలా గజిట్‌లో మార్పులకు ఆమోదం తెలిపారు.

'ఉపాధి' బలోపేతం కోసం పర్యటిస్తాం

● వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు కె.విజయరాఘవన్

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ చట్టం బలోపేతం చేసేందుకు, వ్యవసాయ కూలీల స్థితిగతులపై దేశవ్యాప్తంగా 30వేల గ్రామాలలో అక్టోబర్ నుంచి పర్యటనలు చేపట్టనున్నామని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కె.విజయరాఘవన్ తెలిపారు. బుధవారం హరిత హోటల్‌లో కేరళ రాజ్యసభ సభ్యుడు ఎంపీ శివదాసన్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. విజయరాఘవన్ మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతుల సమస్యలపై రానున్నకాలంలో పోరాటాలు నిర్వహించాలని చర్చించామన్నారు. ఏపీలో భూసేకరణ, భూసమీకరణ పేరుతో రైతులకు నష్టం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో వ్యవసాయాభివృద్ధి తిరోగమనంలో ఉందన్నారు. పేదరిక నిర్మూలనకు భూ పంపిణీయే దివ్య ఔషధమని తెలిపారు. దేశంలోని 40కోట్ల ఎకరాల్లో 12కోట్ల ఎకరాలు ధనికుల చేతుల్లోనే ఉన్నాయన్నారు. ఈ భూములను వ్యవసాయ కార్మికులకు, పేదలకు పంపిణీ చేస్తే గ్రామీణ నిరుద్యోగాన్ని రూపుమాపవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘాల జాతీయ కార్యదర్శి బి.వెంకట్, నాయకులు విక్రమ్‌సింగ్, అఖిల భారత కిసాన్ సభ ప్రధానకార్యదర్శి విజూ కృష్ణన్, మహిళా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కన్వీనర్ లలితాబాలన్, కేరళ వ్యవసాయ కార్మిక సంక్షేమ సంఘం బోర్డ్ చైర్మన్ చంద్రన్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, మహిళావ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ శివ నాగరాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శివకుమార్, వి.అన్వేష్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, దేశంలోని 22రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాధుల బారి నుంచి లేగ దూడలను కాపాడుకోవాలి

● జిల్లా పశుసంవర్థక అధికారి గుణశేఖరపిళ్లై



రైతులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా పశుసంవర్థక అధికారి

పీలేరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నేటి దూడలే రేపటి పాడి ఆవులు అని, వాటిని చిన్నతనం నుంచే వ్యాధుల బారి నుంచి సంరక్షించుకోవాలని జిల్లా పశుసంవర్థక అధికారి గుణశేఖర పిళ్లై పాడి రైతులకు పిలుపునిచ్చారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా పీలేరు మండలం అగ్రహారం పంచాయతీ రామిరెడ్డిగారి పల్లెలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు తల్లి దగ్గర ముర్రుపాలు పట్టినట్లే, పుట్టిన అరగంటలోపు ఆవు దగ్గర లేగ దూడకు ముర్రుపాలు తాగించాలన్నారు. తద్వారా అది నిరోధక శక్తి సాధిస్తుందన్నారు. అనంతరం దూడల పెంపకంలో పాటించాల్సిన మెళకువలు, వాడాల్సిన దాణా, నట్టల నివారణ మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రదర్శనకు హాజరైన దూడల్లో ఆరోగ్యంగా ఉన్న మూడు వాటికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ డీడీ మాలకొండయ్య, పశువైద్యాధికారులు ప్రదీప్, రామచంద్రారెడ్డి, మునిచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

వాల్మీకిపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. అయ్యావారిపల్లెలో బుధవారం ఆయన పర్యటించి ప్రకృతి వ్యవసాయంలో రైతులు సాగు చేసిన 365 రోజుల కూరగాయల పంటలు, 32 రకాల విత్తనాలతో వేసిన పీడీఎంఎస్, వరి, తదితర పంటల సాగును పరిశీలించారు. ఈ మోడల్ ద్వారా వచ్చిన ఆదాయం, పెట్టుబడి తదితర విషయాలపై స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ నాగప్రసాద్, మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, ఏపీఎంఐ జిల్లా పీడీ లక్ష్మీప్రసన్న, కేవీకే శాస్త్రవేత్తలు పీరుసాహెబ్, సోమశేఖర్, ఆత్మ బీటీఎం అమరనాథ్, పవన్, ప్రకృతి వ్యవసాయ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొడవలితో దాడి- ముగ్గురికి గాయాలు



గాయపడ్డ ప్రవీణ్

కలకడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూతగదా విషయమై కొడవలితో దాడి చేసిన ఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన ముడియంవారిపల్లి కొత్తపల్లిలో చోటు చేసుకుంది. సీఐ లక్ష్మన్న వివరాల మేరకు.. ప్రవీణ్‌తో అదే గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి దారి విషయంగా భూమి వద్ద గొడవ పడ్డట్లు తెలిపారు. పరిస్థితి సద్దుమణి గాక తిరిగి ప్రవీణ్ ఇంటి వద్దకు వెళ్లిన ప్రసాద్‌రెడ్డి, అతని అనుచరులు ప్రవీణ్‌పై కొడవలితో దాడి చేసి అడ్డువచ్చిన తండ్రి వెంకటరమణ, తల్లి సుబ్బమ్మను గాయపరచినట్లు చెప్పారు. బాధితులను చికిత్స కోసం 108లో వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని..

సెల్ టవర్ ఎక్కిన భర్త

● విలపించిన తల్లిదండ్రులు, బంధువులు

● అత్త హామీతో టవర్ దిగిన అల్లుడు



గుమికూడిన జనంతో పాటు తల్లి పెంచలమ్మ, (ఇన్‌సెట్లో) పోలీసులకు వివరిస్తున్న కళ్యాణ్



సెల్ టవర్ ఎక్కిన కళ్యాణ్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని మనస్థాపంతో భర్త సెల్ టవర్ ఎక్కిన సంఘటన బుధవారం రైల్వేకోడూరులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని ధర్మాపురానికి చెందిన వెంబడి కళ్యాణ్ రంగనాయకులపేటకు చెందిన లత అనే మహిళను ప్రేమించి పదేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలం కాపురం సాఫీగానే సాగినా.. అనంతరం తరచూ కుటుంబ కలహాలతో భార్యభర్తల మధ్య గొడవలు నెలకొన్నాయని పలువురు చెబుతున్నారు. ఇదివరకే రెండుసార్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లత భర్తపై ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 12.50 గంటలకు రైల్వేకోడూరు ఎక్సైజ్ స్టేషన్ పక్కనే ఉన్న సెల్ టవర్‌ను కళ్యాణ్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపకశాఖల అధికారులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు తదితరులు సెల్‌టవర్ దగ్గరకు చేరుకున్నారు. కిందకు దిగమని ఎంత చెప్పినా వినలేదు. ముందు జాగ్రత్తగా అగ్నిమాపక శాఖ అధికారి విజయకుమార్ వల తెప్పించి సిద్ధం చేశారు. కాగా ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌లు ప్రత్యేక చర్యలు తీసుకుని కళ్యాణ్ అత్తను సెల్ టవర్ వద్దకు తీసుకొచ్చి భార్య లతతో మాట్లాడిస్తామని చెప్పించారు. దీంతో టవర్‌పై ఉన్న కళ్యాణ్ దిగిరావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఇతని భార్య ప్రస్తుతం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో ఉంది. ఆమెను పిలిపించి కాపురం చేయించే విధంగా పోలీసులు, బంధువులు, కుటుంబ సభ్యులు యత్నిస్తున్నారు.

13న జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న రైల్వేకోడూరు ప్రభుత్వ హైస్కూలు మైదానంలో జిల్లా స్థాయి 51వ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు హరినాథ, పి.అరుణలు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికలు పూర్తయిన తర్వాత జిల్లా స్థాయి టీంను ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో విజయవాడలోని గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 51వ అంతర్ జిల్లాల పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపిక పోటీలకు డిసెంబరు 31, 2006 లోపు పుట్టిన వారై ఉండాలని, బాలురు బరువు 75 కిలోలు, బాలికలు 65 కిలోలు ఉండాలన్నారు. వివరాలకు సెల్ నెంబరు 9392951505, 8639020050ను సంప్రదించాలన్నారు.

నకిలీ బంగారం కేసును ఛేదించిన పోలీసులు

● ఇద్దరు అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

రైల్వేకోడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత నెలలో రెండు వేర్వేరు చోట్ల నకిలీ బంగారం కుదవ పెట్టి కొందరు నగదుతో ఉడాయించిన విషయం తెలిసిందే. అయితే అందులో ఓ కేసును పోలీసులు ఛేదించి బుధవారం నిందితులను పట్టుకున్నారు. ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి కథనం మేరకు... పట్టణంలోని బలిజవీధికి చెందిన ఎలిశెట్టి వెంకటేష్ బంగారు కుదవ దుకాణం నడుపుతున్నాడు. ఈ దుకాణానికి గత నెల 20న కలికిరి నియోజకవర్గంలోని కలకడ మండలానికి చెందిన రవికుమార్, సోనియాగాంధీ అనే ఇద్దరు వచ్చి నకిలీ బంగారం (బ్రాస్‌లేట్)ను రూ.1,60,000లకు కుదవ పెట్టి డబ్బుతో ఉడాయించారు. కాగా ఇది నకిలీ బంగారం అని ఆలస్యంగా తెలుసుకున్న దుకాణ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. పరారైన నిందితులను అరెస్టు చేసి రైల్వేకోడూరు న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఇదిలా ఉండగా సదరు బలిజవీధికి చెందిన బంగారు దుకాణ యజమాని రాఘవేంద్ర వద్దకు గతనెల 20న ఓ వ్యక్తి వచ్చి నకిలీ బంగారు బ్రాస్‌లేట్‌ను అమ్మకానికి ఇచ్చాడు. అన్ని పరిశీలించిన యజమాని రూ.2,16,000లు అతనికి ఇచ్చాడు. అనంతరం బ్రాస్‌లైట్‌ను క్షుణ్ణంగా పరిశీలించగా అది నకిలీ అని తేలింది. రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ కేసును కూడా త్వరగానే ఛేదిస్తామని ఎస్ఐ తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తాపడి యువకుడు మృతి



దేవూరి శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం పోడు ప్రధాన జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాజంపేట బోయినపల్లి వద్ద ఉన్న యువకుడు దేవూరి శ్రీధర్ (21) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజంపేట నుండి తిరుపతికి బాడుగ నిమిత్తం వెళ్తుండగా మాధవరంపోడు వద్ద ఆటో బోల్తా పడడంతో శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి 108కు సమాచారం అందజేసి మృతదేహన్ని కోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని, విచారిస్తున్నామని ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీ... స్కూటరిస్టు మృతి



మృతిచెందిన వ్యక్తి

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో స్కూటరిస్టు మస్తాన్ (56) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం మదనపల్లె పట్టణం, టీకేపల్లె వాసి బుడ్డాన్ సాహెబ్ కుమారుడు మస్తాన్ టీకేపల్లె నుంచి స్కూటర్‌పై మనుమరాలిని స్కూల్ నుంచి ఇంటికి పిలుచుకుని వచ్చేందుకు వెళుతున్నాడు. మార్గమధ్యంలోని చంద్రాకాలనీ వద్ద అంగళ్లు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు స్కూటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మస్తాన్‌ను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బోరు వద్ద ఘర్షణ - రైతు తలకు గాయం



గాయపడిన రైతు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోరు వద్ద జరిగిన ఘర్షణలో రైతు తలకు గాయమైంది. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. బుధవారం ఉదయం మదనపల్లె మండలం, పెంచుపాడు గ్రామం, శివారపల్లెకు చెందిన రైతు రెడ్డెప్ప బోరు వద్ద పనులు చేసుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన గంగాధర్, అతని కుమారుడు తేజ ఘర్షణ పడ్డారు. బోరులో ఇరువురికి భాగం ఉన్నందున నీటి సరఫరా విషయమై మాట్లాడుతుండగా, తేజ రాయితో దాడి చేశాడు. తలకు గాయమై స్పృహ కోల్పోయిన రెడ్డెప్పను కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఉరిమే ఉత్సాహం.. సభలో ఉల్లాసం.. స్త్రీ శక్తి..!

సూపర్ హిట్

చంద్రన్న ప్రభుత్వానికి జై కొట్టిన జనం



కింద చోటు లేదు.. అందుకే ఇంతెత్తుకు..!

అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.



మూడు జెండాలు.. మురిపించిన నేతలు





పవనిజం..

యువతరం ఉత్సాహం..

అసాంఘిక కార్యకలాపాలు జరిగితే లైసెన్సులు రద్దు చేస్తాం

● మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి



సూచనలిస్తున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టమోటా మార్కెట్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే లైసెన్సులు రద్దు చేసి, టమోటా వేలం నిర్వహించకుండా ఐదేళ్లు బ్లాక్ లిస్టులో పెడతామని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం టమోటా మండీ యజమానులతో ఆయన మాట్లాడుతూ ఏ మండీలోనైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర మండీలకు ఇబ్బందులు కలిగించకుండా కేటాయించిన స్థలంలోనే వేలం నిర్వహించాలని, టమోటా లోడింగ్ వాహనాలను ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ఉన్న మార్కెట్ స్థలంలో ఉంచాలన్నారు. రైతులు టమోటాలు అన్‌లోడ్ చేసుకున్నాక క్రేట్ల కోసం వాహనాలు ఎక్కడపడితే అక్కడ పెట్టకుండా కొంత సమయం ఆర్టీసీ బస్టాండులోని ఖాళీ స్థలంలో ఉంచాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ బాలాజీ, మండీ యజమానులు కట్టా రామకృష్ణనాయుడు, గోవిందు నాయుడు, బాబునాయుడు, రామకృష్ణ, సుధాకర, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా ... పది మంది కూలీలకు గాయాలు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి పదిమంది కూలీలు గాయపడిన సంఘటన కురబలకోట మండలం, ముదివేడు వద్ద జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. బుధవారం ఉదయం మదనపల్లె పట్టణం, గొల్లపల్లె, విజయనగర్ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీలు ముదివేడు సమీపంలోని కొంగోళ్లపల్లె వద్దనున్న పంట పొలాల్లో టమోటాలు కోసేందుకు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో కురబలకోట మండలం, ముదివేడు సమీపంలోని కృష్ణారెడ్డిపల్లె వద్ద ఆటోకు అడ్డుగా బైక్ రావడంతో దాన్ని తప్పించబోయి ఆటో బోల్తాపడింది. దీంతో పదిమంది కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇందులో అందరూ విజయనగర్ కాలనీకి చెందినవారే. శ్రీనివాసులు, రామసుధ, సరస్వతి, రమణమ్మ, రెడ్డమ్మ, సి.లక్ష్మీదేవి, లక్ష్మీదేవి, ఎం.శ్రీనివాసులు ఆటో డ్రైవర్‌లకు స్వల్పంగా గాయాలయ్యాయి, అయితే ఈ ప్రమాదంలో జే.శ్రీనివాసులుకు(33) కాలు విరగగా, బాలకృష్ణ భార్య రమణమ్మ (52)కు తలకు గాయమై ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి డాక్టర్లు రెఫర్ చేశారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఆటో బోల్తాతో గాయపడి చికిత్స పొందుతున్న మహిళలు

తలారివారిపల్లెకు వైద్య బృందం



రెడ్డికీర్తనను పరీక్షిస్తున్న వైద్య బృందం

ములకలచెరువు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చామకూరి శ్రీధర్ చొరవతో తలారివారి పల్లెలో వైద్య బృందం పర్యటించింది. సోంపల్లెలో మంగళ వారం జరిగిన నానో యూరియా, జీవన ఎరువుల వాడకంపై రైతు అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ హాజరైన విషయం విదితమే. ఈ సందర్భంగా మండలంలోని సోంపల్లె పంచాయతీ తలారివారిపల్లెకు చెందిన దివ్యాంగులు రమణప్ప, రెడ్డి కీర్తన తమకు వందశాతం వైకల్యం ఉందని, తమకు వచ్చే పింఛను పెంచాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై తక్షణం స్పందించిన కలెక్టర్ ఇద్దరి ఆరోగ్య పరిస్థితులను రీ అసెస్మెంట్ చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం వైద్యాధికారి లోకేశ్వర్, వైద్య సిబ్బంది మంజుల, ఇందిరమ్మ, శైలజ, ఖాదర్‌బాషా గ్రామానికి వచ్చి సదరం పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, మాజీ సర్పంచ్ యర్రగుడి సురేష్, మాజీ వైస్ సర్పంచ్ రఫీ, నేతలు షఫీ, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

హ్యాకథాన్‌లో ఉద్యాన విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో యూనివర్సిటీ యాజమాన్యం

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణంలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్‌లో అనంతరాజుపేట ఉద్యాన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ప్రథమ బహుమతులు పొందిన విద్యార్థులు తిరుమల గీతిక, వినయ్‌కుమార్, మాధురి, రేష్మ, ఉదయ్‌కిరణ్, ద్వితీయ బహుమతులు పొందిన విద్యార్థులు సాయివంశీ, భార్గవి, దీపిక, సుష్మిత, జమురంబీ, పూర్ణ ప్రియాంక ఉన్నారు. ప్రథమ బహుమతికి రూ.10 వేలు, ద్వితీయ బహుమతికి రూ.5 వేలు నగదు బహుమతి అందుకున్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను బుధవారం ఉద్యాన యూనివర్సిటీ యాజమాన్యం అభినందించింది.

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

- 20 గొర్రెలు, ఇద్దరు కాపరులు మృతి

జమ్మలమడుగు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్న వారి పాలిట ఓ లారీ మృత్యుశకంగా మారింది. బుధవారం తెల్లవారు జామున గొర్రెలమంద వెళతుండగా అతివేగంగా లారీ దూసుకురావడంతో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెలను తోలుకెళుతున్న ఇద్దరు కాపారులు తీవ్ర గాయాలపాలై మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన జమ్మలమడుగు పట్టణ శివార్లలోని శ్రీసాయి శివానీ కల్యాణ మండపం సమీపాన బైపాస్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాల్లోకి వెళితే...

నంద్యాల జిల్లా రుద్రవరం మండలానికి చెందిన గొర్రెల కాపారులు నెల రోజుల క్రితం గండికోట పరిసర ప్రాంతాల్లో గొర్రెలను మేపుకునేందుకు వచ్చారు. బుధవారం తెల్లవారుజామున తిరిగి వారి గ్రామాలకు వెళ్లేందుకు బయలుదేరారు. గొర్రెలను తోలుకుని జమ్మలమడుగు బైపాస్‌రోడ్డు గుండా వెళుతుండగా.. అదే సమయంలో తాడిపత్రి వైపు నుంచి అతివేగంతో వచ్చిన లారీ గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. దీంతో 20 గొర్రెలు సంఘటనా స్థలంలో నుజ్జునుజ్జయి మృతి చెందాయి. గొర్రెలను తోలుకుని వెళుతున్న కాపరులు రుద్రవరం మండలం నల్లవాగుపల్లెకు చెందిన వరద చిన్నవెంకటేశ్వర్లు (45) రెండు కాళ్లు విరిగి తలకు గాయాలయ్యాయి. అలాగే ఆలమూరు గ్రామానికి చెందిన రాజుపాళెం లక్ష్మీనరసింహ (35) తీవ్రంగా గాయపడ్డాడు. వీరిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో వెంకటేశ్వర్లు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మీనరసింహ మృతిచెందారు. గొర్రెల కాపరుల యజమాని వెనుక ఉండడం వలన ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ ఘటన జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్‌బాబు, ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది అక్కడకు చేరుకొని పరిశీలించారు. ఈ విషయం బంధువులు, కుటుంబ సభ్యులకు తెలియడంతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకుని బోరున విలపించారు. కాగా, ప్రమాదానికి కారణమైన లారీ ఆపకుండా వెళ్లిపో వడంతో పోలీసులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా గొర్రెల మాంసపు ముక్కలు





గొర్రెల కాపరుల మృతదేహాలు

మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు

- ఐసీడీఎస్ పీడీ రమాదేవి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం పలు ప్రత్యేక చట్టాలు అమలవుతున్నాయని జిల్లా మహిళా శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి రమాదేవి అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీ ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మిషన్ శక్తి స్కీం కింద మహిళా సాధికారత-సంకల్ప్ అనే కార్యక్రమం పదిరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు జిల్లాలోని సీడీపీవోలు, సూపర్ వైజర్లకు దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా మిషన్ వాత్సల్య పథకం ద్వారా పిల్లలు దత్తత కావాల్సిన వారు చట్టబద్ధంగా తీసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు, పోక్సో చట్టం, గృహహింస విభాగం, ఫ్రీ మారిటల్ కౌన్సెలింగ్ సెంటర్ గురించి తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవోలు సునీత, శ్రీలత, శ్రీదేవి, డీసీపీవో డీవీఎస్, మిషన్ వాత్సల్య, సఖి వన్‌స్టాప్ సెంటరు సిబ్బంది పాల్గన్నారు.

యూరియా ఎక్కువైతే పంటకు హానికరం



రైతులతో మాట్లాడుతున్న జేడీ చంద్రనాయక్

చాపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంటలకు యూరియాను ఎక్కువగా వాడటం హానికరమని జిల్లా వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్ అన్నారు. అల్లాడుపల్లె, కేతవరం గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ రైతులకు అవసరం ఉన్నంత మోతాదులో యూరియాను సరఫరా చేస్తామని.. ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. మండలంలో ఇప్పటి వరకు 850 మెట్రిక్ టన్నులు యూరియాను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక ఎకరాకు పైరు దిగుబడి వచ్చే వరకు 70 కేజీల యూరియా మాత్రమే ఉపయోగించాలన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియాను ఉపయోంచాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటను పండిస్తే ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించవచ్చని తెలిపారు. మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో పద్మలత, వీఏఏలు విమత్, శివలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

సీకేదిన్నె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు వైద్యసిబ్బందికి సూచించారు. చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్యంపై రీప్రొడెక్టివ్ చైల్డ్ హెల్త్ 2.0 కార్యక్రమం గురించి వివరించారు. గర్భిణీల నమోదు, జననపూర్వ సంరక్షణ, సేవలపై అవగాహన కల్పించారు. సుఖప్రవసాలు, ప్రసవానంతర సేవల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వైద్యాధికారులు రాఘవేంద్ర, అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి మానస, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న స్కూలు బస్సు
- స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థులు



సంఘటనాస్థలి వద్ద ప్రైవేటు స్కూలు వ్యాను

వల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తప్పెట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద బుధవారం సాయంత్రం ప్రైవేటు స్కూలు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు విద్యార్థులు సురక్షితంగా బయట పడారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా... మండల పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఎక్కించుకుని వల్లూరు వైపు వస్తుండగా తప్పెట్ల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడే పొలం పనులు చేసుకుం టున్న ప్రజలు వచ్చి బస్సు అద్దం పగలగొట్టి పిల్లలను సురక్షి తంగా బయటకు తెచ్చారు. దీంతో విద్యార్థులు చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. డివైడరు లేకపోతే పెను ప్రమాదం సంభవించేదని అంటున్నారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

బద్వేలులో పట్టపగలు చోరీ

రూ.10లక్షలు విలువచేసే బంగారు నగలు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

బద్వేలుటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో వరుస దొంగతనాలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. పట్టపగలే ఇళ్లలోకి చొరబడి దొరికినంత దోచుకొని వెళుతున్నారు. ఏ ఇంటికి అయితే తాళం వేసి ఉంటుందో నిఘాపెట్టి చోరీలకు పాల్పడుతున్నారు. బుధవారం పట్టణంలోని మైదుకూరురోడ్డులో కరెంట్ ఆఫీస్ పక్కన వెంకటయ్యనగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు ఇంట్లో దొంగలు చొరబడ్డారు. శ్రీనివాసులు ఉదయాన్నే పని నిమిత్తం ఊరికివెళ్లగా, అతని భార్య సునీత మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి పక్కవీధిలో ఉన్న తన అమ్మగారి ఇంటికి వెళ్లింది. ఒకటిన్నర గంటల సమయంలో అటుగా వెళుతున్న బంధువులు ఇంట్లో తలుపులు తెరిచి ఉండటం గమనించి సునీతకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూడగా ఇంటితాళం పగుల కొట్టి బీరువాలోని రెండు బంగారు నెక్లస్‌లు, ఒక జత బుట్టకమ్మలు, రెండు చైన్లు, నాలుగు ఉంగరాలు, సుమారు 12తులాలు విలువచేసే బంగారు నగలు చోరీ చేసినట్లు పోలీసులకు సమాచారం అందించారు. బద్వేలు అర్బన్‌సీఐ లింగప్ప తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. అనంతరం క్లూస్‌టీంను పిలిపించి చోరీకి గురైన ఇంటిలో తనిఖీలు చేసి, వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ మోటార్ల వైరు చోరీకి యత్నం

- దొంగలను పట్టుకున్న రైతులు ● పోలీసులకు అప్పగింత



పట్టుబడిన దొంగలు

బి.కోడూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభలవీడు గ్రామ పంచాయతీ నరసన్నకొట్టాల గ్రామ సమీ పంలో విద్యుత్ మోటర్ల వద్ద కేబుల్‌వైరు చోరీకి పాల్పడుతున్న దొంగలను రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గాజులపల్లె సుబ్బారెడ్డి, బ్రహ్మారెడ్డి, గాజులపల్లె వెంకట సుబ్బారెడ్డి అనే రైతులు తమ చేలకు నీళ్లు కట్టేందుకు వెళ్లారు. అప్ప టికే దొంగలు కొందరి మోటర్లు కేబుల్ వైరు చోరీ చేశారు. ఈ విషయం మిగతా రైతులకు సమాచారం అందించారు. బ్రహ్మారెడ్డి మోటరు వద్ద కేబుల్‌వైర్లు కత్తిరిస్తుంగా రైతులు వెంబ డించి ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. రైతులు దొంగలను గట్టిగా నిలదీయడంతో బద్వేలు పట్టణంలో 20 మంది గ్రూపు గా ఉన్నామని.. బద్వేలు పరిసర ప్రాంతాల్లో విడివిడిగా వెళ్లి దొంగతనాలు చేస్తుంటామని తెలిపారు. ఈ సమాచారం రైతులు బి.కోడూరు పోలీసులకు అందించడంతో దొంగలను బద్వేలు సర్కిల్ ఆఫీసుకు తీసుకెళ్లారు.

విషజ్వరాల నుంచి మా బిడ్డలను కాపాడండి

- డీఎంహెచ్‌వో ఎదుట కోడిగాండ్లపల్లె ప్రజల ఆవేదన



డీఎంహెచ్‌వో వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు

ముద్దనూరు సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విషజ్వరాల నుంచి మా బిడ్డలను కాపాడాలంటూ డీఎంహెచ్‌వో నాగరాజు ఎదుట కోడిగాండ్లపల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధి కోడిగాండ్లపల్లెలో విషజ్వరాల బారిన పడ్డ చిన్నారులను బుధవారం డీఎంహెచ్‌వో విచారించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 15 సంవత్సరాల లోపు చిన్నారులకు మాత్రమే విషజ్వరాలు వచ్చి రక్త కణాలు తగ్గిపోతున్నాయన్నారు. తీవ్ర జ్వరంతో గ్రామంలో ఓ చిన్నారి మృతి చెందిందన్నారు. అనంతపురం, తాడిపత్రి, కర్నూలు, ప్రొద్దుటూరులోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయిస్తున్నామని, లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కొందరు కర్నూలు, అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. గతంలో గండికోట ప్రాజెక్టుకు బ్యాక్‌వాటర్ వచ్చినప్పుడు ఇదే పరిస్థితి ఉండేదని...సాయంత్రం 4గంటల నుంచి దోమలు వస్తున్నాయన్నారు. దీంతో జ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌వో గ్రామంలోని ఇళ్ల వద్దకు వెళ్లి నీటి నిల్వ ఉన్న డ్రమ్ములు, బానలను పరిశీలించారు. ఫ్రిజ్‌లను కూడా తనిఖీ చేశారు. నీరు నిల్వ ఉన్న డ్రమ్ములు, బానల్లో లార్వా ఉందని గుర్తించారు. నీటిని తొలగించి కొద్ది సేపు ఆరబెట్టాలని సూచించారు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆర్‌ఎంపీల వద్దకు వెళ్ల వద్దని, వారి ఆనాలోచిత వైద్యం ప్రమాదకరమని సూచించారు. కాగా, కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, డాక్టర్ కరీష్మా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాక్ వాటర్‌తో సమస్య లేదు

బ్యాక్ వాటర్‌కు విషజ్వరాలకు ఎటువంటి సంబందంలేదని డీఎంహెచ్‌వో నాగరాజు తెలిపారు. కేవలం ఇళ్లలో నీటి నిల్వ చేసిన డ్రమ్ముల్లో లార్వా చేరడం వల్ల జ్వరాలు వస్తున్నాయి. దోమల బారి నుంచి కాపాడునేందుకు రాత్రి వేళ్లల్లో దోమతెరలు వాడాలన్నారు.

పొలతల హుండీ ఆదాయం రూ.29,79,565



కానుకలను లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

పెండ్లిమర్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొలతల మల్లేశ్వర స్వామి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం స్వామి సన్నిధిలో సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. మల్లేశ్వరస్వామి హుండీ ద్వారా రూ.10,212,439, అక్కదేవతల హుండీ ద్వారా రూ.18,35.392, బండెన్నస్వామి హుండీ ద్వారా రూ.73,508, పుట్ట ఆంజనేయస్వామి హుండీ ద్వారా రూ.47,114, అన్నదానం ద్వారా రూ.1112 ఆదాయ వచ్చిందని ఈఓ కృష్ణానాయక్ తెలిపారు. మొత్తం నాలుగు నెలల కాలానికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకల ద్వారా వచ్చిన ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ, బ్యాంక్ సిబ్బంది, పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ...ఒకరికి గాయాలు

చక్రాయపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేటలో బుధవారం ముందు వెళ్తున్న బైకును వెనుక నుంచి వచ్చిన మరోబైకు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చక్రా యపేట నుంచి గంగిరెడ్డి అనే వ్యక్తి గంగిరెడ్డిపల్లెకు వెళ్తుం డగా వెనుకవైపు రాయచోటి నుంచి వస్తున్న ఓ బైకు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో గంగిరెడ్డి అదుపు తప్పి కింద పడటంతో కాళ్లు, చేతులు తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంట నే వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు కడపరిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవతలపై అసభ్యకర వ్యాఖ్యలు.. వ్యక్తిపై కేసు నమోదు

పులివెందుల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవతలపై అసభ్యకర పోస్టులు, అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సోషల్ మీడియాలో హిందూ దేవతలపై ఉస్మాన్ అనే వ్యక్తి అసభ్యకరంగా పోస్టులు పెట్టారన్నారు. ఈ ఘటనపై హిందూ ఐక్యవేదిక సభ్యులు ఎందుకిలా అసభ్యకర పోస్టులు పెట్టావని ప్రశ్నించినందుకు వారిపై దాడికి దిగారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

చాపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్రవాడ గ్రామానికి చెందిన కదిరేపల్లె విష్ణువర్ధన్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నయోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 7న ఆదివారం విష్ణువర్ధన్ ఓ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈమేరకు బాలిక తండ్రి ఫిర్యాదు చేయడంతో అతనిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డాక్టర్ నాసరమ్మకు గోల్డ్‌మెడల్



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా గోల్డ్‌మెడల్ సాధించిన డాక్టర్ చిన్ననాసరమ్మ

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లెకు చెందిన వెలుగోటి చిన్న నాసరమ్మ డాక్టర్ ఎన్టీఆర్ హెల్ యూనివర్సిటీ నుంచి గోల్డ్‌మెడల్ సాధించారు. బ్యాచిలర్ ఆఫ్ న్యాచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్ (బీఎన్‌వైఎస్)లో రాష్ట్రంలో అత్యధిక మార్కులు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టర్ చిన్న నాసరమ్మ గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ చిన్ననాసరమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రకృతి సిద్ధమైన మార్గాలతో ఆరోగ్యవంతమైన జీవనం గడపాలన్నదే తన లక్ష్యమని వివరించారు.

ఘర్షణ కేసులో ముగ్గురిపై కేసు

పులివెందుల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎస్‌ఆర్ ట్రావెల్స్ వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి ఏఎస్‌ఆర్ ట్రావెల్స్ వద్ద బస్సుకు ముందు ఉన్న కారు అడ్డుగా ఉందని పక్కకు తీయాలని ట్రావెల్స్ వారు వాహనదారుని కోరారన్నారు. దీంతో ఆ వాహనదారుడు రెచ్చిపోయి ట్రావెల్స్ వారిపై ఘర్షణకు దిగారు. ఈ మేరకు బాలగంగిరెడ్డి మరో ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు విస్తరణ ఎప్పుడో...!

- ఎదురు చూస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

చెన్నూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు చేపడతారా అని స్థానికులు ఎదురు చూపులు చూస్తున్నారు. దాదాపు పదినెలల క్రితం విస్తరణ పనుల కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు మండల సర్వే సిబ్బంది సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారు. ఆ తర్వాత అధికారులు సమావేశాలు పెట్టడం, తేదీలు చెప్పడం తప్ప ఆక్రమణల తొలగింపు లేదు. విస్తరణ పనులు ముందుకు సాగిందీ లేదు. దీంతో నిత్యం ఈ రహదారి గుండా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెన్నూరు మేజరు గ్రామ పంచాయతీలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి దాదాపు 500 మీటర్లు ఉంటుంది. 2024 డిసెంబరులో అప్పటి సర్వేయరు సోమశేఖర్ సర్వే చేసి ఆక్రమణలు తొలగించేందుకు మార్కింగ్ ఇచ్చారు. ఏడాది గడుస్తున్నా ఆక్రమణలు తొలగించిన దాఖలాలు లేవు. ఇటీవల కడప ఆర్డీవో సమావేశం ఏర్పాటు చేసి సెప్టెంబరు 9న ఆక్రమణలు తొలగిస్తాం అని చెప్పి వెళ్లారు. గడువు దాటినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో చెన్నూరు-కొండపేట మీదుగా బస్సులు రాకపోకలు సాగించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు స్పందించి ఈ ఆక్రమణలు తొలగించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



చెన్నూరులో రోడ్డు విస్తరణకు నోచుకోని ఆర్‌అండ్‌బీ రోడ్డు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వేంపల్లె ఈఓగా నాగభూషణంరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఏమిరెడ్డి నాగభూషణంరెడ్డిని నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. వీరపు నాయునిపల్లెలో కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనను పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. వేంపల్లెలో కొద్దినెలల క్రితం అవినీతి ఆరోపణలతో ముగ్గురు ఈఓలు సస్పెండ్ కాగా రామసుబ్బారెడ్డి, మాధవరెడ్డి ఈఓగా జాయిన్ అయి కొద్దిరోజులు పనిచేసిన తర్వాత సెలవుపై వెళ్లారు. తాజాగా నాగభూషణంరెడ్డికి ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎల్‌పీఎం నెంబరు సమస్యను పరిష్కరిస్తాం : ఆర్డీవో

కమలాపురం రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే ద్వారా తలెత్తిన జాయింట్ ఎల్‌పీఎం నెంబరు సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతామని ఆర్డీవో జాన్ ఎర్విన్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు శివరామిరెడ్డితో రీసర్వే వల్ల ఉన్న సమస్యలపై చర్చించారు. జాయింట్ ఎల్‌పీ నెంబరు ఉండడం వల్ల రైతులకు రావలసిన అన్నదాత సుఖీభవ,తల్లికి వందనం కానీ వారి ఖాతాలో పడలేదన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

'బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలలకు అనుమతులు ఇచ్చే ఎన్‌సీటీఈ చాలా కళాశాలలకు నోటీసులు జారీ చేసిందన్నారు. ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పవన్‌కుమార్, నగర కార్యదర్శి కిషోర్,రాజు, విష్ణు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఆరోగ్యం


పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చెన్నూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని డీపీవో రాజ్యలక్ష్మి అన్నారు. చెన్నూరులో పారిశుధ్య కార్మికులకు రెండోరోజు శిక్షణ కార్యక్రమంలో గ్రామంలో తిరిగి తడి, పొడి చెత్తను ఎలా సేకరించాలి, వాటిని సేకరించేటప్పుడు ప్రజలకు ఏం తెలపాలి, అలాగే తడి, పొడి చెత్తను ఒకే చోట ఉంచితే కలిగే అనర్థాలు, వేరుగా ఉంచడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలపాలన్నారు. అనంతరం డీడీవో చెన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు, ట్రంకు రోడ్డు, ఇతర ప్రాంతాల్లో డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డితో కలిసి తిరిగి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.

ఆర్టీసీ ఉద్యోగులను వేధించే పద్ధతులకు స్వస్తి పలకండి

సమావేశంలో ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ నాయకులు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులను (కండక్టర్లు- డ్రైవర్లు, మెకానిక్స్) వేధించే పద్ధతులకు ఆయా డిపోల మేనేజర్లు స్వస్తి పలకాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి, జోనల్ నాయకుడు కోడూరు సుబ్బారావు, కోరారు. బుధవారం స్థానిక ఎన్‌ఎంయూఏ కార్యాలయంలో ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ రీజనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప రీజియన్ పరిధిలోగల అన్ని డిపోలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పట్ల అక్రమ పనిష్మెంట్లు, రికవరీలను ఇష్టానుసారంగా చేయడం దారుణమన్నారు. సమావేశంలో జేఏసీ ఛైర్మన్ శ్రీనివాసులు,రీజినల్, జోనల్ నాయకులు గ్యారేజీ కార్మికులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం



కడప (క్రైం)సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన ఎస్. రఘువర్మ కుటుంబానికి బుధవారం ఎస్పీ అశోక్ కుమార్ ఆర్థిక సహాయం అందజేశారు. రఘువర్మ భార్య విజయమేరి కి రూ 2.5 లక్షల చెక్ ను అందజేయడంతో పాటు ఆమె యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకట రమణ. జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వారంతే.. వీరింతే..!

తీరు మార్చుకోని ఆర్టీసీ, ఆటో డ్రైవర్లు ● ఏదైనా ప్రమాదం జరిగినపుడు మాత్రం అర్ధగంట హంగామాతో సరిపుచ్చుతున్న అధికారులు


కొత్తరోడ్డుపై నుంచి చెన్నూరు లోపలికి వచ్చేదారిలో అడ్డంగా ఇష్టానుసారంగా ఆపిన ఆటోలు

చెన్నూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు కొత్తరోడ్డు వద్ద హైవేలో ఆర్టీసీ,ఆటో డ్రైవర్ల తీరు ఇబ్బందికరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా ఆర్టీసీ, ఆటో డ్రైవర్లు తమ వాహనాలు స్టేజీ వద్ద నిలుపు కోవాలని పదే పదే చెప్పినా, స్టాప్ బోర్డులు ఏర్పాటు చేసినా వారి తీరులో ఏ మాత్రం మార్పు రావడంలేదు. దీంతో ఎంత చెప్పినా వారంతే.. ఏం చెప్పినా వీరింతే అని ప్రజలు అంటున్నారు. మామూలుగా చెన్నూరు ప్రధాన గ్రామం నుంచి వివిధ ప్రాంతాల్లోకి వచ్చేందుకు కొత్తరోడ్డుపై కి వచ్చి హైవేలో బస్సు కోసం ఎదురు చూసేవారికి ఆ బస్సును చెన్నూరు వెళ్లే రోడ్డులో కడప వైపున ఆపాలి. అలాగే ప్రొద్దుటూరు వైపు వెళ్లేవారి కోసం ఖాజీపేట వైపు బస్సులు ఆపాలి. అయితే ఈ రెండు చోట్ల ఆర్టీసీ డ్రైవర్లు ఎక్కడ ఆపాలో అక్కడ ఆపకుండా ఆపాల్సిన ప్రదేశం వెనుక వైపు వాహనాలు ఆపుతున్నారు. ఫలితంగా కడపకు వెళ్లేవారు ద్విచక్ర వాహనాల్లో కానీ, ఇతర నాలుగు చక్రాల వాహనాలు, నడిచి వచ్చిన వారికి ఖాజీపేట వైపు వాహనాలు ఆపితే వాటి వెనుక వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమా దాలు జరుగుతున్నాయి. అలాగే ప్రొద్దుటూరు వైపు వచ్చేవారికి వెళ్లేవారికి కడప వైపు వాహనాలు ఆపడం వల్ల వాటి వెనుక వచ్చే వాహనాలు సరిగా కనిపించడంలేదు. ఈ రెండు చోట్ల వాహనాలు ఆపడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు ముంచు కొస్తాయోనని ప్రజలు భయపడుతున్నారు. ఇలా ఆపడం వల్ల ఇటీవల కాలంలో పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. వాటిని దృష్టిలో ఉంచుకుని అయినా వాహనాలు నడిపే తీరు మార్చుకోండి అని చెబుతున్నా వారు యథాప్రకారంగా వాహనాలు ఆపుతున్నారు తప్ప కాసింత ముందుకు వెళ్లి ఆపితే ప్రమాదాలు జరగవు కదా అన్న ఆలోచన ఏ మాత్రం చేయడలేదు. దీంతోప్రజలు వీరికి ఎంత చెప్పినా అంతే వీరి తీరులో మార్పురాదంతే అని అంటున్నారు.

అలాగే ఆటోలు డ్రైవర్లు కూడా తమ వాహనాలను కడప వైపు కొద్దిగా ముందువైపు ఆపాల్సి ఉన్నా చెన్నూరు నుంచి హైవే ఎక్కే చోటే ఇష్టానుసారంగా అడ్డంగా ఆటోలు ఆపుతున్నారు. ఈ విషయమై గతంలో పోలీసు, పంచాయతీ సిబ్బంది ఎంత చెప్పినా వారి మాటలు చెవికెక్కడంలేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ కొత్తరోడ్డు ప్రాంతంలో రద్దీగా ఉంటుంది. ఇది ఒక సెంటరు పాయంట్ కావడంతో ఉదయం 6 నుంచి9 వరకు, సాయంత్రం 4.30 నుంచి 8 వరకు ఎక్కువగా ప్రయాణికులు వాహనాల కోసం వేచి ఉండడం జరుగుతుంది. పోలీసులు ఇక్కడ గట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గతంలో డీఎం చెప్పినా ఇంతే...

ఆర్టీసీ బస్సులను, బస్‌స్టాప్ అని బోర్డు పెట్టిన చోటనే ఆపాలని కడప ఆర్టీసీ డీఎం ఢిల్లీశ్వర్‌రావు చెన్నూరుకు రెండుమార్లు వచ్చి కొత్తరోడ్డులో బస్సు డ్రైవర్లకు సూచనలు చేశారు. బస్సు ఆపే ప్రదేశం కాకుండా 20 మీటర్లు ముందు ఆపితే ఏ సమస్యా ఉండదని చెప్పడం జరిగింది. అయితే ఆయన చెప్పినరోజు మాత్రం వాహనాలు కాసింత ముందు ఆపినా ఆ మరుసటిరోజు మాత్రం యథాప్రకారంగా వాహనాలు ఆపుతున్నారు. దీంతో ఆర్టీసీ అధికారులు చెప్పిన మాటలు కూడా బేఖాతరు అవుతున్నాయి. కాగా ఇటీవల ప్రజలు సైతం ఈ ఆర్టీసీ ఆటోడ్రైవర్ల తీరుతో విసుగెత్తిపోయారు. బస్‌షెల్టర్లు కట్టరు, సర్వీసు రోడ్లు వేయరు, ఎక్కడపడితే అక్కడ ఆపుతున్నారు. హైవే అధికారులు అయినా స్పందించి సర్వీసు రోడ్డు కట్టి బస్‌షెల్టరు కట్టిస్తే అక్కడ బస్సులు ఆపుతారు కదా, అంత వరకు సమస్యలున్నాయని వాహనాలు ముందుకు వచ్చి ఆపాలని చెప్పినా మారడంలేదు. ఏదైనా ప్రమాదం జరిగినపుడు మాత్రం అక్కడకు పోలీసుల వచ్చి అర్ధగంట హంగామా చేయడంతోనే సరిపుచ్చుతున్నారు.


స్టేజీ వద్ద కాకుండా వేరేచోట ఆగిన ఆర్టీసీ బస్సు

సూపర్‌సిక్స్ - సూపర్‌హిట్‌కు పులివెందుల నుంచి 80 మంది వలంటీర్లు


వలంటీర్లతో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మైసూరారెడ్డి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అనంతపురంలో నిర్వహించిన సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ కార్యక్రమంలో పులివెందుల నుంచి 80 వలంటీర్లు సేవ చేశారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆదేశాలతో కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జా మైసూరారెడ్డి ఆధ్వర్యంలో 80 మంది వలంటీర్లు సభకు తరలివెళ్లారు.

'రైతు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం'

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజలను మభ్యపెట్టేందుకు సూపర్‌సిక్స్ కార్యక్రమాన్ని చంద్రబాబు నిర్వహించారని తెలిపారు. బుధవారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత పోరు విజయవంతమైందన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, పులి సునీల్‌కుమార్, ఇలియాస్, సీహెచ్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

సింహాద్రిపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రోత్సహించేందుకే నగదు బహుమతులు అందజేస్తున్నట్లు దీనబంధు ఆశ్రమం వ్యవస్థాపకుడు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అంకాళమ్మగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో మార్కులు సాధించిన సి. తేజస్విని (571), పి. అభిసారిక (568)కు రూ. 6వేలు, రూ. 4వేలు నగదు బహుమతులు విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు.

ట్రిపుల్‌ఐటీకి ఆర్టీసీ బస్సు

వేంపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా ట్రిపుల్ ఐటీకి ఆర్టీసీ బస్సు నడపలేదు. 11వ తేదీ బుధవారం నుంచి వేంపల్లె నుంచి ట్రిపుల్‌ఐటీకి ఆర్టీసీ బస్సును నడుపుతున్నారని, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్, మహమ్మద్, జబీవుల్లా, బాలకృష్ణారెడ్డి, శివ, మస్తాన్ విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సును వేయించారన్నారు.

విద్యార్థినులకు అట్టలు పంపిణీ

వేంపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులకు ఉచితంగా పరీక్ష అట్టలను ఆవోపా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆవోపా అధ్యక్షుడు సునీల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవోపా ప్రతినిధులు అరవింద్, ద్వారక, కృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

పంటల ఆరోగ్యాన్ని అంచనా వేసేందుకే 'పొలం రోగ నిర్ధారణ'


వరిపొలాలను పరిశీలిస్తున్న డాట్ బృందం

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంటల ఆరోగ్యాన్ని అంచనా వేయడం కోసమే పొలం రోగనిర్ధారణ సందర్శన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని జిల్లా వ్యవసాయ సలహా,సాంకేతిక బదిలీ కేంద్రం (డాట్),సంబంధిత శాఖల నిపుణుల బృందం సభ్యులు తెలిపారు. మండలంలోని యు.రాజుపాలెం గ్రామంలో బుధవారం పొలం రోగ నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్యం పంటల ఆరోగ్యాన్ని అంచనా వేయడం, రైతులకు స్థలంలోనే మార్గదర్శనం అందించడం, పంటలలో వ్యాప్తి చెందుతున్న తెగుళ్లు, రోగాలను గుర్తించి సకాలంలో చర్యలు సూచించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంకయ్య, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్,డాక్టర్ వి.మాధురి, సైంటిస్ట్, ఏడీఏ ఎన్‌వీ నరసింహారెడ్డి, ఏఓ శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మోతాదు మించి ఎరువులు వాడితే అనర్థమే

కమలాపురం రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అవసరం మేరకే రైతులు ఎరువులను ఉపయోగించుకోవాలని లేకపోతే అనర్థం జరుగుతుందని ఏడీఏ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రగుడిపాడు పందిళ్లపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరం మేరకు యూరియా, ఎరువులను వాడాలన్నారు. వరి సాగులో పాటించాల్సిన మెళకువలను రైతులకు వివరించారు.

పంట మార్పిడితో భూమి సారవంతం

వేముల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితో భూమి సారవంతంగా తయారవుతుందని ఏవో జీపీ ఓబులేసు అన్నారు. బుధవారం మండలంలోని సిద్దంరెడ్డిపల్లెలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు వాటి ప్రయోజనాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి సురేష్, వీహెచ్‌ఏ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు న్యాక్‌లో జాబ్‌మేళా

పులివెందుల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యాక్, సీడాప్ ఆధ్వర్యంలో పులివెందులలో ఈనెల 12వ తేదీన న్యాక్‌లో జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45ఏళ్లలోపు ఉండి, పది, ఇంటర్, డిగ్రీ, పీజీ,ఐటీఐ, డిప్లమో, బీటెక్ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. ఏఐఎల్ డిక్సన్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, పుష్కల్, చానల్‌ప్లే, ఆదిత్యబిర్లా, సంయుగ్లాస్, జాన్‌డీర్, ఓం ఎలక్ట్రిక్ క్యాబ్స్, యంగ్ ఇండియా వంటి కంపెనీలు పాల్గొననున్నాయన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, బయోడేటాతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9640015507 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రుణాలను వెంటనే మంజూరు చేయాలి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు పీఆర్‌ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు కె.శంకర్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు రవీంద్రనాథరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకింగ్ సబ్సిడీ రుణాలను వెంటనే విడుదల చేయాలని ఈ రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 10న నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. దీంతో జిల్లాలోని అర్హులైన వారు సబ్సిడీ రుణాల కోసం సుమారు 6వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కానీ ఆ తరువాత ప్రక్రియ కొనసాగించకుండా ఆపివేశారన్నారు. చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే అర్హుల జాబితా విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఎస్ వైఎఫ్ జిల్లాకన్వీనరు ఓరుగంటి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఆర్‌సీఎం డయాసిస్ ఎయిడెడ్ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో జిల్లా వ్యాప్తంగా అవకతవకలకు పాల్పడిన ఆర్‌సీఎం యాజమాన్యం, వాటికి సహకరించే విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ డిమాండ్ చేస్తున్నామని జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయంలో ఏడీ రామకృష్ణకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహ, జిల్లా నాయకులు సునీల్ పాల్గొన్నారు.

టిడ్కో భవనాలకు మౌలిక వసతులు కల్పించండి

కమిషనర్ మనోజ్‌రెడ్డి


టిడ్కో సముదాయాలను పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టిడ్కో సముదాయాల్లో మౌలిక వసతులు త్వరితగతిన కల్పించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. అక్టోబరు రెండో తేదీలోగా అన్ని పనులు పూర్తికావాలని చెప్పారు. బుధవారం కడప నగరం లక్ష్మీనగర్‌లోని టిడ్కో భవనాలను టిడ్కో, ఇంజనీరింగ్, హార్టికల్చర్, మెప్మా శాఖల అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. భవనాల పరిసరాలు, రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి, టిడ్కో గృహాలలోకి వెళ్లి పరిస్థితులను ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రాబోయే అక్టోబరు 2 లోపు గృహాలకు సంబంధించిన అన్ని మరమ్మతులను పూర్తిచేసి లబ్ధిదారులకు అందుబాటులో ఉంచేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

' మెడికల్‌కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి'

కమలాపురం రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్ షిప్ మోడల్ ద్వారా నిర్వహించాలనే నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బాలచంద్ర తెలిపారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వమే వైద్యవిద్యను ప్రైవేటు వ్యాపారం వర్గాల చేతికి అప్పగించడం రాష్ట్ర ప్రజలను ఆందోళన కలిగిస్తోందని అన్నారు.

క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడడం అవివేకం


కడప...మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, పులివెందులలో అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడడం అవివేకమని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ తెలిపారు. బుధవారం వైవీయూలో ఎన్‌ఎస్‌ఎస్ 3,4 యూనిట్ల పీఓలు డాక్టర్ కె.లలిత, డాక్టర్ ఎస్.సునీత ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త వెంకటరామిరెడ్డి, ఆచార్య రియజాన్నీసా, డాక్టర్ మునికుమారి, డాక్టర్ అశ్వత్థరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మరణం సమస్యకు పరిష్కారం కాదు..: మరణం సమస్యకు పరిష్కారం కాదని ప్రముఖ సైకాలజిస్ట్ వెంకటేశ్వర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు రంగనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగరం ఎస్‌కేఆర్‌అండ్‌ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆత్మహత్యల నివారణ దినం పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష పలు సూచనలను తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఎం.గురుమోహన్‌రెడ్డి, మహిళా సాధికార విభాగం కన్వీనర్ నాగరత్నమ్మ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌ఏరియా మేనేజర్ శివశంకర్ రెడ్డి, శ్రీరామయ్య చిట్స్ మేనేజర్ బాజీ, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థినులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..: మానసిక దృఢత్వం కలిగి ఉన్నప్పుడు ఎలాంటి సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందని జన విజ్ఞాన వేదిక, యాంటీ సూసైడ్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.సనా వుల్లా విద్యార్థులకు సూచించారు. బుధవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా స్థానిక ప్రభుత్వమహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్,జేవీవీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనం తరం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాలనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ యు.శ్రీనిత మాట్లాడుతూ మరణం సహజం అయితేనే జీవితానికి సార్థకత అన్నారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

కొండాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఈనెల 11వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్థానిక వెలుగు ఆఫీసులో గురువారం ఉదయం 9 గంటలకు ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. కడప కొప్పర్తిలోని డిక్సన్ కంపెనీలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన 18-32 సంవత్సరాల యువతీ, యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యార్హతల జిరాక్స్ సర్టిఫికెట్లు తీసుకురావలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూటమి మండల ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డి కోరారు.

పేకాటరాయుళ్లకు రిమాండ్

జమ్మలమడుగు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికోట పరిసర ప్రాంతాల్లో పట్టుబడిన 22 మంది పేకాటరాయుళ్లకు జమ్మలమడుగు కోర్టులో హాజరుపరచగా ఈనెల 23వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు అర్బన్ సీఐ నరేష్ బాబు తెలిపారు. ఈనెల 7వ తేదీ జూద స్థావరాలపై దాడులు చేశామన్నారు. పట్టుబడిన 22 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11,83,940 నగదు స్వాధీనం చేసుకున్నామని, వాటిని బుధవారం కోర్టుకు హాజరుపరచడం జరిగిందన్నారు. సాయంత్రం పేకాటరాయుళ్లకు రిమాండ్ విధించడంతో వారిని సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు.

తలనీలాల సేకరణకు రూ.19.64 లక్షల వేలం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిమాను గురప్పస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన వేలంపాటలో తలనీలాల సేకరణను గురజాలకు చెందిన సురేశ్ రూ.19.64 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే కూల్‌డ్రింక్ షాపుల నిర్వహిణకు నాగేంద్ర రూ.1.84 లక్షలు, టెంకాయలు అమ్ముకునేందుకు రూ.4.10లక్షలు, అంగళ్లకు రూ.4.10లక్షలు, కొబ్బరిచిప్పల సేకఱకు రూ.43500 గురప్పగారిపల్లెకు చెందిన పుల్లయ్య దక్కించకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగారెడ్డి, రాజంపేట డివిజను తనిఖీ అధికారి జనార్ధన్, మల్లికార్జునరెడ్డి, సుబ్బరాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జేవీవీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

బద్వేలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13, 14వ తేదీలలో నిర్వహించనున్న జనవిజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏడీ దేవదత్తం, జిల్లా గౌరవసలహాదారుడు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రజలలో ఉన్న మూఢనమ్మకాలు, భయాలు, అవిశ్వాసాలను తొలగించి, విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణంలో ఈ వేదిక కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పవన్‌కుమార్, లాజరయ్య, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో ప్రజలు కటకట.. రోగులతో ఆసుపత్రులు కిటకిట

పోరుమామిళ్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కొన్నిరోజులుగా మండలంలో విష జ్వరాలు ప్రబలడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఏ ఆసుపత్రిలో చూసినా ఉదయం నుండి రాత్రి వరకు విషరోగాల బారిన పడి చికిత్సలు పొందుతున్నవారే. ఆర్థిక స్తోమత లేని పేదవారు సైతం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. జ్వరాలు తగ్గించుకోవడానికి వేలకు వేల డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. కుటుంబంలో ఇద్దరు ముగ్గురికి, మరికొన్ని చోట్ల కుటుంబం మొత్తం జ్వరాల బారిన పడడంతో వారు సంపాదించిన డబ్బంతా ఆసుపత్రులకే సరిపోతోందని వాపోతున్నారు. మరికొందరు అప్పులు చేసుకుని ఆరోగ్యం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు ఈ జ్వరాల బారిన పడి మంచానికే పరిమితమయ్యారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మల్లేశ్ అన్నారు. బుధవారం ఆయన పోరుమామిళ్లలోని ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, వైద్యుల అర్హత పత్రాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసరు సాదు వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలసపాడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మల్లేశ్ సూచించారు. బుధవారం ఆయన స్వచ్ఛ ఆసుపత్రిలో భాగంగా కలసపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. బయోమెడికల్ సెగ్రిగేషన్, ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీ, ఆడిట్ తదితర కార్యక్రమాల గురించి సిబ్బందితో రివ్యూ చేశారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే మండల కేంద్రంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను కూడా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజ, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, బాలాజీ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

బద్వేలు/బద్వేలు రూరల్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రులకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఉపవైద్య ఆరోగ్య శాఖాధికారి మల్లేశ్ అన్నారు. బుధవారం ఆయన పలు ప్రైవేటు ఆసుపత్రులను సందర్శించి హాస్పిటల్ రిజిస్ట్రేషన్, పారామెడికల్ స్టాఫ్ క్వాలిఫికేషన్‌పై ఆరా తీశారు. ఆసుపత్రుల సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఏవైనా పొరపాటు జరిగితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సింగ్ హోమ్, హాస్పిటళ్లను పరిశుభ్రంగా ఉంచుకుని వేస్ట్ మేనేజ్‌మెంటు పాటిస్తూ ఫైర్ ఎన్‌వోసీ రికార్డులు, రిపోర్టులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య, డెంటల్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రి సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా ఉప వైద్యఆరోగ్యశాఖాధికారి మల్లేశ్

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ బాల బాలికల జట్ల ఎంపిక

జమ్మలమడుగు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ బాలబాలికల జట్ల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా జమ్మలమడుగు ఎంఈవో చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ఎస్.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 9వ తేదీ నుంచి రెండు రోజులపాటు క్యాంపు నిర్వహించారన్నారు. అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రామాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి కడపజిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. బాలుర విభాగం నుంచి 10మందిని, బాలికల విభాగం నుంచి 10మందిని ఎంపిక చేశారు. జిల్లా జట్లకు సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి క్రీడా దుస్తులు వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ చంద్రశేఖర్‌రావు, జిల్లా అసోసియేషన్ సెక్రటరీ వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ ఓబయ్య, సీనియర్ క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అర్బన్ సీఐ రమణారెడ్డి హెచ్చరించారు. మండలంలోని వనిపెంట గ్రామంలో ఏర్పాటు చేసిన కళాజాత కార్యక్రమంలో మేలు కొలుపు అనే నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జాతీయ సంపదల్లో ఒకటైన ఎర్రచందనాన్ని రక్షించుకోవడం మన అందరి బాధ్యత అని తెలిపారు. కొందరు స్మగ్లర్లు డబ్బులు ఎరవేసి యువతను తప్పుత్రోవ పట్టిస్తున్నారని, ఒక్కసారి ఎర్రచందనం కేసులో పట్టుబడితే జీవితాంతం జైలు జీవితం అనుభవించాల్సిదేనని హెచ్చరించారు. అలాగే సైబర్‌నేరాల గురించి సీఐ రమణారెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు.

మాతృశిశు సంరక్షణ అందరి బాధ్యత

బద్వేలు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మాతృశిశు సంరక్షణ మనందరి బాధ్యత అని అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవిబాబు అన్నారు. బుధవారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణీ, బాలింతలను, చిన్నపిల్లలను రీప్రొడక్ట్ అండ్ చైల్డ్ హెల్త్‌లో నమోదు చేసి అన్ని సదుపాయాలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు వేసిన వెంటనే రీవెన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు పెంచాలన్నారు. మండల పరిధిలో ఉన్న గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా జ్వరాలు ఉంటే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్‌కుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటరు వెంగయ్య, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

జమ్మలమడుగు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నరేశ్ హెచ్ఐవీ, ఎయిడ్స్, తదితర అంటువ్యాధుల పట్ల జాగ్రత్తల గురించి వివరించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైతన్య సొసైటీ ప్రతినిధులు శోభ, భారతి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి



ఉపాధ్యాయురాలికి సభ్యత్వం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024 నుండి పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల కరువు భత్యం వెంటనే ప్రకటించాలని, అలాగే ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు ఎంప్లాయిస్ హెల్త్ కార్డు పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, యాప్‌లను, అసెస్మెంట్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 11వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని, 12న మండల కేంద్రాల్లో నిరసనలు, 13, 14న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల సమర్పణ, 15న తాలూకా కేంద్రాల్లో నిరసన, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన, 17న ముఖ్యమంత్రికి మెయిల్స్ ద్వారా వినతిపత్రాలు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, క్రిష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, సయ్యద్‌బాష, సుబ్బయ్య, ఖాసీంపీరా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులకు చట్టబద్ధత కల్పించాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

బద్వేలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): 15 సంవత్సరాలుగా ప్రభుత్వం ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోయినా స్థిర నివాసం ఏర్పచుకుని నివాసముంటున్న భగత్‌సింగ్‌నగర్‌కు చట్టబద్ధత కల్పించాలని సీపీఐ ఎంఎల్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఆర్డీవో చంద్రమోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్, జిల్లా కమిటీ మెంబర్ జకరయ్య మాట్లాడుతూ సర్వేనెంబరు 11, 54, 24లో దాదాపు 15సంవత్సరాలుగా స్థిరనివాసం ఉన్న పేదలను కాదని నేడు ఓ రాజకీయ నాయకుడు కోర్టు ద్వారా తెచ్చుకున్న ఉత్తర్వులను అమలు చేసేందుకు అధికారులు సిద్ధం కావడం తగదన్నారు. ఆ తీర్పునకు రెవెన్యూ అధికారులు రిట్ పిటీషన్ వేసి పేదలకు హక్కు పత్రాలను ఇవ్వాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బాబు, రామరాజు, నారాయణ, చంద్రపాల్, విజయరావు, పాండు తదితరులు పాల్గొన్నారు.



సామాన్య ప్రజల హక్కులు కోర్టుల్లోనే చంపబడుతున్నాయి

● నేను మౌన ప్రేక్షకున్ని కాదు పుస్తక పరిచయ సభలో హేమంత్‌కుమార్

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 79 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో సామాన్య ప్రజల హక్కులు అత్యున్నత న్యాయ స్థానాల్లోనే గొంతు నులిమి చంపబడుతున్నాయని జన విజ్ఞాన వేదిక యూత్‌కన్వీనర్ లెక్చరర్ హేమంత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక నందిని కాంప్లెక్స్‌లోని జేవీవీ కార్యాలయంలో మానవ హక్కుల కార్యకర్త స్టాన్ స్వామి రాసిన పుస్తకం 'నేను మౌన ప్రేక్షకున్ని కాదు' తెలుగు అనువాద పరిచయ సభ నిర్వహించారు. ఈ సభలో హేమంత్‌కుమార్ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు నిరంకుశ ఉపా చట్టం తెచ్చిన తరువాత దేశమే జైలుగా మారిందని స్టాన్ స్వామి అనుభవాలు వెల్లడిస్తున్నాయన్నారు. బవబంధాలను వొదిలి అసంఖ్యాక ప్రజల హక్కుల కోసం ముఖ్యంగా ఆదివాసిల కోసం పోరాడి జైలు నిర్బంధానికి బలికాబడ్డ గొప్ప మానవ హక్కుల నాయకుడు స్టాన్ స్వామి అన్నారు. విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మీ మాట్లాడుతూ 2018లో మహారాష్ట్రలోని భీమాకోరేగావ్ కేసులో ఐదురాష్ట్రాలకు చెందిన మేధావులపై కుట్ర కేసు నమోదు చేసి ఏళ్ల తరబడి జైలు నిర్బంధంలో వుంచారన్నారు. కార్యక్రమంలో మిత్రజ్యోతి సాహితీ సంస్థ కార్యదర్శి మహమూద్, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తవ్వా సురేశ్, రచయితలు జింకా సుబ్రమణ్యం, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, దాదాహయాత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేవీవీ యూత్ కన్వీనర్ హేమంత్‌కుమార్

సచివాలయాలను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్

బద్వేలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని పూసలవాడ, దూదేకుల వీధి సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే సచివాలయంలో ఉన్న మౌలిక సదుపాయాలపై వారితో చర్చించి కంప్లైంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా సంతకం పెట్టాలని సూచించారు. అనంతరం పలువురు స్థానికులతో మాట్లాడి సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.



సచివాలయంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి



ఎరువుల మోతాదు మించొద్దు

● వ్యవసాయ శాఖ ఏడీఏ అనిత

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడటం వలన భూసారం దెబ్బతిని పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని ప్రొద్దుటూరు డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ అనిత, ఏవో వరా హరికుమార్ తెలిపారు. మండల పరిధిలోని చెన్నమరాజుపల్లె, నంగనూరుపల్లెలో అధిక యూరియా వాడకం-దుష్ప్రభావాలపై బుధవారం గ్రామసభలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవసరానికి మించి యూరియా వాడడం వలన చీడపీడల ఉధృతి ఎక్కువై రైతాంగానికి సాగు ఖర్చు పెరుగుతుందన్నారు. భూగర్భ జలాలు కలుషితమై నేల ఆమ్లీకరణ, నీటి వనరుల యూట్రిఫికేషన్, గ్రీన్‌గౌస్, వాయు ఉద్గారాలను పెంచుతుందన్నారు. దీంతో మొక్కల పెరుగుదలలో ప్రతికూల ప్రభావం చూపుతుందని, పంటనాణ్యత, దిగుబడి తగ్గడంతో పాటు సూక్ష్మజీవుల కార్యకలాపాలు తగ్గి జీవవైవిధ్యంపై ప్రభావం చూపుతాయని వివరించారు. పంట పెరుగుదలకు నత్రజని (యూరియా) చాలా అవసరమైనప్పటికీ అధిక మోతాదులో వాడడం వలన అసమతుల్యతకు దారి తీసి మొక్కల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. నేటి కాలంలో వానపాములు కనుమరుగు అవుతున్నాయంటే భూమిలో రసాయనాల ప్రభావమే కారణమన్నారు. వరిసాగులో దుక్కులో ఎకరాకు 25 కేజీల యూరియా, నాటిన 20-25 రోజులకు రెండో దఫా 25 కేజీలు, 40-45 రోజుల్లో 3వ దఫాలో మరో 25 కేజీల యూరియా సరిపోతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వాడాలి



రైతులకు వివరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంటలలో రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని శ్రీరామ్‌నగర్, కొత్తపల్లె గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు ఉల్లి, పసుపు పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వాడటం వలన అధిక దిగుబడి వస్తుందని, పెట్టుబడి ఖర్చు కూడా తక్కువగా ఉంటుందని తెలిపారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కొండాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చౌటిపల్లె జడ్పీహైస్కూల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ పెన్షనర్లకు ఇవ్వాల్సిన రూ.25,000 కోట్లలో రూ.13,000 కోట్లను మాత్రమే ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్ము అవసరం మేరకు మంజూరు చేయడం లేదన్నారు. పెన్షనర్ల గ్రాట్యూటీ నగదు మంజూరులో కాలయాపన జరుగుతోందని, వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీచర్లు పి.రాజులు, నరసింహుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): నేటి మహిళలు ఐలమ్మ ధైర్య సాహసాలను ఆదర్శంగా తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. బుధవారం తెలంగాణ సాయుధ పోరాట వీర నారీమణి ఐలమ్మ 40వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు పడిగె వెంకటరమణ, నాగరాజు మాట్లాడుతూ 1948లో సాయుధ తెలంగాణా పోరాటంలో తన భూమిని కాపాడుకోవడంలో కొంగు నడుముకు కట్టి, కొడవలి చేతపట్టి రజాకరుల ఆగడాలను అడ్డుకున్న ధీరవనిత అని కొనియాడారు. ఆమె చనిపోయే వరకు మహిళల కోసం, వారి సమస్యల కోసం పోరాడిన మహనీయురాలు ఐలమ్మ అని అన్నారు. కార్యక్రమంలో జ్యోతి సుజాత, ఓబులమ్మ, శివప్రసాద్, సుధాకర్, బ్రహ్మయ్య, దేవి, తిరుమల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతి, సహనంతో జీవించాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతి, సహనంతో జీవించాలని జమా అతే ఇస్లామి హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యుడు ఇందాదుల్లా హస్సేని తెలిపారు. బుధవారం సాయంత్రం భారత్ ఫంక్షన్ హాలులో నేటి సమాజానికి అంతిమ దైవం ప్రవక్త మహమ్మద్ సందేశం అన్న అంశంపై ఆధ్యాత్మిక బహిరంగ సమావేశం నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త 23 సంవత్సరాల స్వల్పకాలంలోనే తన బోధనలతో ప్రజల్లో మార్పు తెచ్చి మక్కాలో ఒక సుందర సమాజాన్ని నిర్మించారని తెలిపారు. మానవాళి సంక్షేమం కోసం శాంతి, సామరస్యంతో ప్రజలు సోదరభావంతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో మౌలానా అబ్దుల్‌ఖాదీర్, మొహిద్దీన్, మౌలానా, గౌస్‌మొద్దీన్, నిజామి, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పంటలకు ఉపశమనం

రాజుపాలెం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు బుధవారం కురిసిన భారీ వర్షం కాస్త ఊరటనిచ్చింది. చల్లని వాతావరణం ఏర్పడింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సాగైన పత్తి, కంది, మినుము పంటలు సరైన వర్షం లేక విపరీతమైన ఎండలతో వాడుముఖం వేశాయి. ఈ పంటలకు ఇప్పుడు కురిసిన వర్షం కాస్త ఉపశమనం అందించినట్లేనని రైతులు చెబుతున్నారు. వారం రోజులుగా జొన్న సాగు చేసిన రైతులకు జొన్నపంటలో అక్కడక్కడా తేమ లేనిచోట కూడా మొలకలు వచ్చే అవకాశం ఏర్పడింది. అయితే లోతట్టు ప్రాంతాల్లో సాగైన పంటలు దెబ్బతినే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు. మండలంలోని రాజుపాలెం, కొరపాడు, సోమాపసురం, గాదెగూడూరు, వెంగలాయపల్లె, కొట్టాల తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. రబీ పంటలు సాగు చేసుకునేందుకు మరింత అవకాశం ఏర్పడిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పత్తిలో పంటలో నిలిచిన వర్షపునీరు